# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 21-03-2024** **సమయం : 1.20 గంటలు**

# ముఖ్యాంశాలు

1. **రాష్ట్ర ముఖ్యమంత్రి, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి చేపట్టనున్న బస్సు యాత్ర ఈనెల 27వ తేదీ నుంచి ప్రారంభం కానుంది.**

2. **దేశవ్యాప్తంగా ఎనిమిది కోట్ల మంది వలస కార్మికులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది.**

3. **త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది.**

4. **ఏపీపీఎస్సీ నిర్వహించిన 2018 గ్రూప్-1 మెయిన్స్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది.**

5. **భవిష్యత్ తరాల కోసం ఇండియా కూటమి తరపున పోరాటం చేస్తున్నామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల తెలిపారు.**

==========================

ఈనెల 27వ తేదీ నుంచి ముఖ్యమంత్రి వై. ఎస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వై. ఎస్. జగన్మోహన్ రెడ్డి బస్సు యాత్ర ప్రారంభం కానుందని ఉపముఖ్యమంత్రి, ఆ పార్టీ నాయకులు కె.నారాయణస్వామి తెలిపారు. చిత్తూరు జిల్లా గంగాధర నెల్లూరు పట్టణంలో ఆయన ఈరోజు ఎన్నికల ప్రచారంలో పాల్గొని మాట్లాడుతూ ప్రజల కోసమే పనిచేస్తున్న తమ పార్టీని మరోసారి అధికారంలోకి తీసుకురావాలని ప్రజలను కోరారు.

--------------------------

దేశవ్యాప్తంగా ఎనిమిది కోట్ల మంది వలస కార్మికులకు రేషన్ కార్డులు మంజూరు చేయాలని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలను సుప్రీంకోర్టు ఆదేశించింది. జాతీయ ఆహార భద్రతా చట్టం పరిధిలోకిరాని 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో నమోదు చేసుకున్న కార్మికులకు రేషన్‌కార్డులు ఇవ్వాలని పేర్కొంది. 2023 ఏప్రిల్‌లోనే దీనికి సంబంధించి ఆదేశాలు ఇచ్చినప్పటికీ జాప్యం జరిగిందని, ఇప్పటికైనా వారికి కార్డులు మంజూరు చేయాలని తెలిపింది. 'ఈ-శ్రమ్' పోర్టల్‌లో మొత్తం 28 కోట్ల 60 లక్షల మంది కార్మికులు నమోదయ్యారు. వీరిలో 20 కోట్ల 63 లక్షల మందికి రేషన్ కార్డులు మంజూరు చేశారు. దీంతో మిగిలిన వారికి కూడా కార్డులు ఇవ్వాలని న్యాయమూర్తి జస్టిస్

హిమా కోహ్లి ఆదేశించారు. సామాజిక ఉద్యమకారులు అంజలి భరద్వాజ్, హరీష్ మందేర్, జగ్దీప్ చొకర్ దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ జరిపిన కోర్టు ఈ మేరకు ఆదేశాలు జారీ చేసింది.

---------------------------

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. అందులో భాగంగా 85 ఏళ్లు పైబడినవారు, 40శాతానికిపైగా అంగ వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. నిబంధనలకు అనుగుణంగా ఓ కంపార్టుమెంట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను తీసుకువచ్చి పోలింగ్ సిబ్బంది ఓటరు ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించుకుంటారు. ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటును ఉపయోగించుకోవాలనుకునే వృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 5 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఫారం 12డి ని రిటర్నింగ్ అధికారికిగానీ, సహాయ రిటర్నింగ్ అధికారికిగానీ పంపించాలి. దరఖాస్తు చేసుకునేవారు తమ పూర్తి చిరునామా, సంప్రదించాల్సిన ఫోన్ నంబరు పొందుపరచాలి. ఈ దరఖాస్తు ఎన్నికల సంఘం వెబ్ సైట్లో అందుబాటులో ఉంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్..ఏపీపీఎస్సీ నిర్వహించిన 2018 గ్రూప్-1 మెయిన్స్‌ను రద్దు చేస్తూ సింగిల్ జడ్జి బెంచ్ ఇచ్చిన తీర్పుపై రాష్ట్ర హైకోర్టు తాత్కాలిక స్టే విధించింది. గ్రూప్ -1 మెయిన్స్‌ను రద్దు చేస్తూ ఇటీవల సింగిల్ జడ్జి బెంచ్ తీర్పు ఇచ్చింది. మెయిన్స్ రద్దు చేసి మళ్లీ నిర్వహించాలని అందులో పేర్కొంది. దీనిపై ఏపీపీఎస్సీ, రాష్ట్ర ప్రభుత్వం హైకోర్టులో అప్పీల్ చేయగా.. విచారించిన ఉన్నత న్యాయస్థానం తదుపరి విచారణను వారం రోజులకు వాయిదా వేసింది.

---------------------------

బ్యాంకులకు భారతీయ రిజర్వ్ బ్యాంకు-ఆర్బీఐ కీలక ఆదేశాలు జారీ చేసింది. మార్చి 31వ తేదీ ఆదివారం ప్రభుత్వ శాఖల ఖాతాలు నిర్వహించే బ్యాంకులకు సెలవు రద్దు చేసింది. దేశంలోని అన్ని ఏజెన్సీ బ్యాంకుల బ్రాంచులు తెరిచి ఉంచాలని స్పష్టం చేసింది. 2023-24 ఆర్థిక సంవత్సరంలోని ప్రభుత్వ ఆర్థిక కార్యకలాపాలను పూర్తి చేసేందుకు ఈ నిర్ణయం తీసుకున్నట్లు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలియచేసింది.

---------------------------

తెలుగుదేశం పార్టీ లోక్‌సభ, శాసనసభ అభ్యర్థులకు ఈ నెల 23వ తేదీన విజయవాడలో ప్రత్యేకంగా వర్క్‌షాప్ నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమానికి ఆ పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు హాజరవుతారు. ఉదయం నుంచి సాయంకాలం వరకు నిర్వహించే ఈ కార్యక్రమానికి.. అభ్యర్థులతో పాటు ప్రతి నియోజకవర్గానికి సంబంధించి ఇప్పటికే నియమించుకున్న అడ్మినిస్ట్రేటివ్ మేనేజర్, పొలిటికల్ మేనేజర్, మీడియా మేనేజర్, సోషల్ మీడియా మేనేజర్లను ఆహ్వానించారు. రాబోయే రెండు నెలల కాలంలో ఎన్నికల కార్యాచరణ, పోల్ మేనేజ్‌మెంట్‌లో అనుసరించాల్సిన వ్యూహాలపై ఈ వర్క్‌షాప్‌లో వారికి అవగాహన కల్పిస్తారు.

---------------------------

భవిష్యత్ తరాల కోసం ఇండియా కూటమి తరపున తాము పోరాటం చేస్తున్నామని రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వైఎస్.షర్మిల తెలిపారు. విజయవాడ బాలోత్సవ భవన్‌లో ఇండియా కూటమి భాగస్వామ్య, సారూప్య పార్టీలు.. రాజకీయ, రైతు, కార్మిక, మహిళా, ప్రజా సంఘాల ఐక్యవేదిక సమావేశం జరిగింది. ఈ సమావేశంలో

ఆమెతో పాటు రైతు సంఘం నాయకులు వడ్డే శోభనాదీశ్వరరావు, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి శ్రీనివాసరావు, ప్రత్యేక హోదా సాధన సమితి అధ్యక్షులు చలసాని శ్రీనివాస్, జై భారత్ పార్టీ అధ్యక్షులు వి.వి.లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

---------------------------

అత్యధికంగా పోలింగ్ జరిగే విధంగా అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నట్లు స్వీప్ పశ్చిమగోదావరి జిల్లా నోడల్ అధికారి ప్రభాకర్ రావు తెలిపారు. ఉండి, ఆకివీడు, కాళ్ల మండలాలకు చెందిన బూత్ లెవెల్ అధికారులు, పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పోలింగ్‌పై అవగాహన సదస్సును ఉండిలో ఈరోజు నిర్వహించారు. అనంతరం స్వీప్ నోడల్ అధికారి ఆకాశవాణితో మాట్లాడారు. 2019 ఎన్నికల్లో పశ్చిమగోదావరి జిల్లాలో 82 శాతం పోలింగ్ జరిగిందని దీన్ని మరింత పెంచేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని ప్రభాకరరావు వివరిస్తూ ....

**.....వాయిస్.... 40 సెకన్లు....**

---------------------------

ఈరోజు ప్రపంచ కవితా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నారు. ఐక్యరాజ్యసమితి, విద్య, వైజ్ఞానిక మరియు సాంస్కృతిక విభాగం 1999వ సంవత్సరంలో ప్యారిస్‌లో జరిగిన 30వ సమావేశంలో ప్రతిసంవత్సరం మార్చి 21వ తేదీన ప్రపంచ కవితా దినోత్సవంగా నిర్వహించాలని తీర్మానంచేశారు. విభిన్న భాషలు, సంస్కృతులతో కూడిన వివిధ దేశాల ఆలోచనలను కవిత్వం ద్వారా పరస్పరం పంచుకొని భిన్నత్వంలో ఏకత్వం సాధించే లక్ష్యంతో ప్రపంచ కవితా దినోత్సవం నిర్వహిస్తున్నారు.

---------------------------

తిరుపతిలోని శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాయలయంలో జరుగుతున్న జాతీయ గ్రంథాలయ అభివృద్ధి, విస్తరణ సదస్సు ఈ రోజు మూడవరోజుకు చేరుకుంది. మానవ జీవపరిణామ క్రమ అధ్యయన సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ జాతీయ సదస్సుకు దేశంలోని ఏడు రాష్ట్రాల నుంచి 60 మందికిపైగా విశ్వవిద్యాలయాల గ్రంథాలయాల ఇన్చార్జ్‌లు హాజరై పౌర గ్రంథాలయాల్లో సేవలు ఏ విధంగా మెరుగుపరచాలి అన్న విషయంపై చర్చల్లో పాల్గొంటున్నారు. మరో రెండురోజుల పాటు ఈ సదస్సును నిర్వహించనున్నామని..గ్రంథాలయాల అభివృద్ధికి ఈ సదస్సు ఎంతగానో దోహదపడుతుందని నిర్వాహకులు ఆకాశవాణికి తెలిపారు.

---------------------------

తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి దర్శనానికి సంబంధించిన ఆర్జిత సేవా టిక్కెట్లు, శ్రీవారి సేవా టికెట్ల కోటాను తిరుమల తిరుపతి దేవస్థానం ఈరోజు ఆన్ లైన్ ద్వారా విడుదల చేసింది. ఆర్జిత సేవలైన కళ్యాణోత్సవం, ఊంజల్ సేవ, ఆర్జిత బ్రహ్మోత్సవం, సహస్ర దీపాలంకరణ సేవా టికెట్ల కోటాను విడుదల చేసింది. అలాగే ఈనెల 23వ తేదీ ఉదయం 10గంటలకు అంగప్రదక్షిణం టోకెన్లు, మధ్యాహ్నం 3గంటలకు శ్రీవాణి ట్రస్టు దాతలకు దర్శన టోకెన్లు, గదుల కోటా, వృద్ధులు, దివ్యాంగుల దర్శన టోకెన్లను టిటిడి ఆన్‌లైన్‌లో విడుదల చేయనుంది.

---------------------------

రాష్ట్రంలో ప్రస్తుత వాతావరణ పరిస్థితులను అమరావతిలోని భారత వాతావరణ కేంద్ర అధికారి ఎం.వెంకట్రావు కొద్దిసేపటి క్రితం ఆకాశవాణి విజయవాడ ప్రాంతీయ వార్తా విభాగానికి వివరిస్తూ...

**.....వాయిస్.... 21 సెకన్లు.....**

---------------------------

అధికార భాష హిందీకి వున్న గుర్తింపును రైల్వే సిబ్బంది ప్రతిఒక్కరూ తెలుసుకుని ఉత్తర ప్రత్యుత్తరాలు, సంభాషణల్లో హిందీకి ప్రాముఖ్యతనిచ్చి దేశసమగ్రతలో భాగం కావాలని వాల్తేర్ రైల్వే డివిజనల్ మేనేజర్ సౌరభ్ ప్రసాద్ సూచించారు. డిఆర్ఎమ్ కార్యాలయంలో గత త్రైమాసికంలో అధికార భాషా శాఖ కార్యకలాపాలను చర్చించేందుకు డివిజనల్ పరిధిలో అధికార భాషా అమలు కమిటీ విశాఖలో నిన్న సమావేశమైంది.

=======================